క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

గీసుకొండ/దుగ్గొండి : లోక్ అదాలత్‌లో కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని గీసుగొండ సీఐ కె.రామకృష్ణ, దుగ్గొండి ఎస్సై జక్కుల పరమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు హనుమకొండలోని అదాలత్‌లో 'నేషనల్ లోక్ అదాలత్' నిర్వహిస్తారని పేర్కొన్నారు. యాక్సిడెంట్, కొట్టుకున్న, చీటింగ్, వివాహ సంబంధమైన, చిన్న దొంగతనాలు తదితర రాజీపేడే అవకాశమున్న కేసుల విషయంలో ఇరు వర్గాలు లోక్ అదాలత్‌కు హాజరు కావాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పర్వతగిరి/వర్ధన్నపేట : ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పర్వతగిరి, వర్ధన్నపేట తహసీల్దార్లు వెంకటస్వామి, విజయసాగర్ కోరారు. తమ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఈనెల 2, 3తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఓటరు లిస్టులో పేరును పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదు కానట్లయితే వెంటనే ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు.

ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

గీసుకొండ : వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు, యూరోపియన్ ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎన్‌హెచ్‌ఎంలో పని చేసే అన్ని కేడర్ల ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేసి వారిని పర్మనెంట్ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య సంఘాల సెంట్రల్ కోర్ కమిటీ నాయకులు బానోతు నెహ్రూ చంద్ నాయక్, బత్తిని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసే మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కోర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆర్.ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవాలి

సంగెం : సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజు అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం గవిచర్లలో పంటక్షేత్ర ప్రదర్శన, రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గణేష్, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు గాలి భిక్షపతి, సురేష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్ షాపులో చోరీ

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ఓదెల శివకుమార్‌కు చెందిన బాలాజీ సెల్‌ఫోన్ రిపేరింగ్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నైనాల గణేష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి షాపులోకి చొరబడి సుమారు రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్లతోపాటు సామగ్రి అపహరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సన్మానం

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన జానపద కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, మిమిక్రీ కళాకారుడు ఏకంబ హన్మంతరావును హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్మంతరావును పలువురు కళాకారులు అభినందించారు.

ఘనంగా డ్రైవర్స్ డే

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో డ్రైవర్లు శుక్రవారం డ్రైవర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం, డ్రైవర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పాశం మల్లికార్జున్ మాట్లాడారు. డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు కనుగుల వేణు, లక్కరాజు, టేకుల స్వామి, రఘు, రమేష్, అనిల్‌కుమార్, ప్రశాంత్, స్వామి, అనిల్, తదితరులున్నారు.

నివాళి

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన ఇస్మాయిల్ పాషా అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు అందించారు. మాధవరెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు హరిబాబు, ఎంపీటీసీ లింగమ్మ మురళి, పూల్‌సింగ్, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ మోడెం ఎల్లగౌడ్ ఉన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

నల్లబెల్లి : మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపీపీ ఊడుగుల సునీత అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల ప్రగతి నివేదిక చదవుతుండగా రంగాపురం సర్పంచ్ చీకటి ప్రకాశ్, ఎంపీటీసీ జన్ను జయరావు అడ్డుకున్నారు. గత రెండు సమావేశాల్లోనూ సభ దృష్టికి తీసుకొచ్చిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించడం లేదని మండిపడ్డారు. అక్రమాలను అరికట్టడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల్లేవని అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకుని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అంగన్‌వాడీ టీచర్లు సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథపై చర్చ జరుగుతుండగా ఏఈ ప్రభావతి ప్రగతి నివేదిక చదివేందుకు యత్నించగా రేలకుంట సర్పంచ్ సిద్దురి రత్నాకర్‌రావు అడ్డుకున్నారు. మూడేళ్లుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రాజెక్టులో రేలకుంట, రంగాపురం చివరి గ్రామాలు కావడంతో కొన్ని సాంకేతిక కారణాల నేపథ్యంలో పూర్తి స్థాయిలో నీరు అందించలేకపోతున్నామని మిషన్ భగీరథ ఏఈ సతీష్ సమాధానమిచ్చారు. త్వరలోనే సమస్యను అధిగవిస్తామని భరోసా ఇచ్చారు. ఎంఈఓ హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సభకు హాజరు కాని అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీడీఓ విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అనుమతి లేకుండా సభకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గందె శ్రీలత, తహసీల్దార్ రాజేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఊడుగుల సునీత

ఉపాధి ధ్యేయంగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా

రాయపర్తి : యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఎర్రబెల్లి దయాకర్ రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన లైసెన్స్ మేళాను శుక్రవారం ఆయన సందర్శించి యువతకు అవగాహన కల్పించారు. ప్రతీ రోజు 200 మంది యువతీ, యువకులకు లెర్నింగ్ లైసెన్స్ అందించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత సకాలంలో హాజరై మేళాలో పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, గజవెల్లి ప్రసాద్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ప్రోగ్రాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కద్దూరి రత్నాకర్‌రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జ్‌లు అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, సత్తూరి నాగరాజు, గారె కిరణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.



యువకులతో మాట్లాడుతున్న ఎంపీపీ

ఎమ్మెల్యేకు సన్మానం



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గంలో చర్చిలు, మసీదుల నిర్మాణానికి రూ.4.79 కోట్లు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని స్థానిక క్యాంప్ కార్యాలయంలో ముస్లిములు, క్రైస్తవులు శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆయా మతాల పెద్దలు, కోఆప్షన్ సభ్యులు, క్లస్టర్ బాధ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ధనసరి సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయ్, సురేష్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇటీవల 5089 పోస్టులతో వేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన మేరకు 13 వేల 89 పోస్టులతోపాటు ఉపాధ్యాయుల సర్దుబాటు అనంతరం మిగిలిన తొమ్మిది వేల ఉపాధ్యాయ పోస్టుల మొత్తానికి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాల్సి ఉందన్నారు. సుమారు ఐదేళ్ల తర్వాత 6 లక్షల మంది అభ్యర్థులు హాజరు కానుండగా 5 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం దుర్మార్గమన్నారు. వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించకుంటే విద్యార్థులు, నిరుద్యోగులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కోశాధికారి రవి, పీవైఎల్ నాయకులు కళ్యాణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మడేలయ్య బోనాలు



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి గ్రామంలో దత్తాత్రేయ రజక సంఘం ఆధ్వర్యంలో రజక కులస్తులు శుక్రవారం మడేలయ్య బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కుల పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే బీఆర్‌ఎస్ బలోపేతం

వర్ధన్నపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ బండౌతపురం గ్రామ ఇన్‌చార్జ్‌లు పూజారి రఘు, సూరారపు నిరంజన్ కోరారు. మండలంలోని బండౌతపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలని, ఏవైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తామని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని తెలిపారు. ప్రతిపక్షాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూజారి రఘు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు రావాలి



రాయపర్తి : పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో తలపెట్టిన సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠకు మండలం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ కోరారు. మండలంలోని మొరిపిరాల, శివరామాపురం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ బొట్టుపెట్టి ప్రజలను ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పారుపల్లి సుధాకర్‌రెడ్డి, వేముల రమేష్, మంత్రి పీఏ సారంగం, అనిరెడ్డి యాకూబ్‌రెడ్డి, చెడుపాక కుమారస్వామి, కన్నెకంటి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, సోమయ్య, సాయి, యాకయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వర్ధన్నపేట : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు జాతీయ రహదారుల విభాగం ఏఈ మదన్, వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉన్నరపల్లి క్రాస్ రోడ్డు నుంచి నీలగిరిస్వామి తండా వరకున్న రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను శుక్రవారం వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడారు. గుర్తించి రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కట్ర్యాల, ఇల్లంద, ఎంపీడీఓ కార్యాలయం, తిరుమలాయపల్లి క్రాస్ రోడ్డు, డీసీ తండా తదితర చోట్ల రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ, సీఐ, ఎస్సై

వైభవంగా వరలక్ష్మీ వ్రతం



నర్సంపేట : పట్టణంలోని పద్మశాలి సంఘం ఆవరణలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గూడ రామకృష్ణ శర్మ పద్మశాలి కుల మహిళలతో వ్రతం చేయించారు. కార్యక్రమంలో రుద్ర ఓంప్రకాశ్, గాజుల సాంబయ్య, కామణి రవీందర్, గాజుల రమేష్, శ్రీరాముల కోటేశ్వర్, పర్శ శ్రీధర్, కోడూరి రవి, శ్యామల నర్సింగం, వలస సత్యనారాయణ, గాజుల రాము, చిప్ప శ్రావణ్, పెండెం రాజేశ్వరి, వెలుదండి స్వరూప గాజుల విమల, బూర విజయలక్ష్మి, కామణి, జ్యోతి, పర్శ సుమలత, కూచన సరస్వతి, మార్త రజిత, కూచన ఝాన్సీ, శ్రీరాముల అమృత, కూచన రజిత, పెన్నం రమేష్, మార్త అశోక్, రాము, కిరణ్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

రాయపర్తి : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను అందిస్తోందని పెర్కవేడు సర్పంచ్ చిన్నాల తారశ్రీ రాజబాబు తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలోని దేవుని చెరువులో ప్రభుత్వం మంజూరు చేసిన చేపపిల్లలను శుక్రవారం ఆయన వదిలి మాట్లాడారు. చేపపిల్లలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. చేపపిల్లలను పెంచి పెద్దయ్యాక విక్రయించి ఆర్థికాభివృద్ధిని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు శాపురం సాయిలు, ఊగ రవి, ఊగ నర్సయ్య, పిట్టల బుచ్చయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.



చెరువులో చేపపిల్లలను వదులుతున్న సర్పంచ్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

నర్సంపేట : విద్యార్థులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని దళితరత్న కల్లేపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో బొట్ల నరేష్ అధ్యక్షతన వివిధ విద్యార్థి సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రణయ్ మాట్లాడారు. అనంతరం విద్యార్థి ఐక్య వేదిక కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మొగిలిచర్ల సందీప్, కోకన్వీనర్లుగా బొట్ల నరేష్, సదరం వినయ్‌భాస్కర్, కె.రవి, మంచాల హరినాథ్, గౌరవ అధ్యక్షుడుగా ప్రణయ్‌దీప్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రవి, ప్రణయ్, వినయ్, రవీందర్, కృష్ణ, రవితేజ, రాజు, ప్రసాద్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలు

నర్సంపేట : పట్టణంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. అనంతరం సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌బాబు, కార్యదర్శి పోతు రాజు రాజు,తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చుక్క రమేష్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పశువుల ఆరోగ్య సంరక్షణ

సంగెం : టీకాలు వేయించడం ద్వారా పశువులను వ్యాధుల బారి నుంచి సంరక్షించొచ్చని మండల పశు వైద్యుడు బాణ్య నాయక్ తెలిపారు. మండలంలోని కృష్ణానగర్‌లో పలు పశువులకు శుక్రవారం మద్దచర్మం, గాలికుంటు వ్యాధుల నివారణ టీకాలు శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడి గేదెలు, పశువులు వ్యాధుల బారిన పడ్డాక చికిత్స చేయించే కంటే నివారణ కోసం టీకాలు వేయించడం ఉత్తమమని తెలిపారు. రైతులు పశువులకు ముందస్తుగానే టీకాలు వేయించి వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారి మోహన్, రైతులు పాల్గొన్నారు.



పశువుకు టీకా వేస్తున్న వైద్యుడు బాణ్య

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

నర్సంపేట : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ జిల్లాస్థాయి శిక్షణా తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. తరగతులకు పార్టీ పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా 'చారిత్రక భౌతికవాదం'పై రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ.రమణ బోధించారు. అనంతరం రంగయ్య మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెట్టిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ నిరుద్యోగాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణను విస్మరించారని, రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే గ్యాస్ సిలిండర్ ధర కొంత తగ్గించారని చెప్పారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి తిరిగి అధికారంలోకి రావడానికి కుట్ర చేస్తోందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాలు నిర్మించే దిశగా శ్రేణులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, నలిగంటి రత్నమాల, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, అనంతగిరి రవి, నాయకులు ఎం.ప్రత్యూష, కందికొండ రాజు, పరికి మధూకర్, బుర్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతమల్ల రంగయ్య

రహదారిపై కమ్ముకుంటున్న పొగ

పర్వతగిరి : మండల కేంద్ర శివారులోని స్మశాన వాటిక మూలమలుపు సమీపంలోని రహదారి పక్కన పడేసిన చెత్తకు నిప్పుపెట్టడంతో పొగతో కమ్ముకుంటోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. పల్లె ప్రగతి పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినా రోడ్ల పక్కన మాత్రం చెత్త దర్శనమిపస్తోండడం గమనార్హం. మండల కేంద్రానికి డంపింగ్ యార్డు లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది ప్రతీ రోజు చెత్తను తెచ్చి రోడ్ల పక్కన పడేస్తున్నారు. పర్వతగిరి నుంచి నెక్కొండ వెళ్లే రహదారిలో ఉన్న మూలమలుపు వద్ద రోడ్డు పక్కనే రోజు వారీ చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోవడంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రి వేళల్లో పలువురు హోటళ్ల నిర్వాహకులు చెత్త సంచుల్లో సేకరించిన వ్యర్థాలను రోడ్డు పక్కనే వదిలేస్తున్నారు. కుక్కలు, పందులు చెత్త కుప్పల్లో తిరుగుతుండడంతో అపరిశుభ్ర వాతావరణం జనాన్ని బెంబేలెత్తిస్తోంది. పాదాచారులు, వాహనదారులు మరింత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త ఎక్కువ మోతాదులో నిండినప్పుడు మాత్రమే అధికారులు చెత్తను అక్కడే కాల్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువు, కాల్వ గట్లపై, ప్రధాన రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోకుండా చూడాలని, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పొగతో నిండిన రహదారి

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



రాయపర్తి : తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నెక్కొండ: తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయపర్తి : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పారుపల్లి సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్ల శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించి మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పున్నం అంజయ్య, ఎస్.మాధవి, ప్రవీణ్‌రెడ్డి, రవీందర్, వినోద్‌రెడ్డి, ప్రభాకర్, దేవేందర్, పద్మావతి, రోజారాణి, అనిత, స్వప్న, శోభ, స్వర్ణ, శ్రీనివాస్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : ఉపాధ్యాయులు పీఆర్టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించగా యూనియన్ మండల అధ్యక్షుడు మాలోతు ప్రతాప్‌సింగ్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు జి. శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్, ఎం.ఐలయ్య, బి.భిక్షపతి, రతన్‌సింగ్, నర్సయ్య, రాంబాబు, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, ఎర్రబెల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



రాయపర్తి : క్షీరాభిషేకం చేస్తున్న వీఓఏలు



నల్లబెల్లిలో..

రాయపర్తి : వీఓఎల వేతన పెంపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని స్వర్ణభారతి మండల సమాఖ్య భవనం ఆవరణలో శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పూస మధు, మంత్రి పీఏ సారంగం, ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు, యాదగిరి, అనిత, దేవేంద్ర, పావణి, అమరావతి, నాగరాజు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని మదర్ తెరిస్సా మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో వీఓఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఊడుగుల సునీత మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గందె శ్రీలత, మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మీ, కార్యదర్శి కనకం అనూష, డీఎన్‌డీ వెంకట్, ఏపీఎం సునీత, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలుదాసరి రమేష్, మండల అధ్యక్షుడు పొన్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల పంపిణీలో ఎమ్మెల్యే జోక్యం సరికాదు'

చెన్నారావుపేట : లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయడంలో ఎమ్మెల్యే జోక్యం సరికాదని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధూకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామాల్లో డ్రా తీస్తున్నా ఎమ్మెల్యేలు వారి అనుచరుల, పార్టీ నాయకుల పేర్లను సూచిస్తూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. కులాల్లో చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే తీరు మార్చుకోకపోతే రానున్న ఎన్నికల్లో గొల్లకురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. లబ్ధిదారులకు గొర్రెలకు బదులు నగదు బదిలీ చేస్తే అవకతవకలకు ఆస్కారం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు.